# అందాలరాసి మనసు

"ఊఁ అయితే ఇంతకీ నువ్వు చెప్పేదేమిటి?" — విసుగ్గా అడిగాడు గోపాలం.

"అదేమిట్రా నాయనా? అలా విసుక్కుంటే ఎలాగురా?" — చంటివాణ్ణి బ్రతిమిలాడుతోన్నట్టే అంది వాళ్ళమ్మమ్మ — "నా మాట కాస్త వినరా! నిక్షేపంలాంటి సంబంధం! నీకు కట్నాలూ కానుకలూ .... నీ వెనుక ఆడబిడ్డలకి కోరుకున్నన్ని లాంఛనాలూ .... పెళ్ళికూతురికి ఒంటి నిండా బాలతొడుగూ .... చీరా .... సారే ...."

"అబ్బ! ఆ సోదంతా ఆపు. ముందు అసలు రహస్యం చెప్పేయ్!" అసహనంగా అరిచాడు గోపాలం.

"అదేమిట్రా గోపాలం? అలా అరవకురా నా తండ్రీ! నీ పట్టుదల నీదేకానీ మరి మంచీ చెడ్డా లేదట్రా! ఇంకా ఎన్నేళ్ళిలా వుంటావురా?"

"చచ్చేవరకూనే!"

"ఎవరూ? నేనా?" — ఉరిమి చూసింది అమ్మమ్మ. "మధ్య నేనేం చేశాన్రా?"

"నువ్వుకాదే! నేనే! చచ్చేవరకూ నా పట్టుదల మారదంటున్నాను.

"నీ నెత్తికొట్టా. నోటికెంతమాటవస్తే అంతమాటా అంటావుట్రా!"

"మరేం చేస్తాను? నాకు ఘడియకూడా తాపీలేకుండా చేస్తున్నావు. నీ బోడి సంబంధాలూ నువ్వూను. ఎలాగూ కష్టపడుతున్నావు. నాకు కావలసిన పిల్లనే చూడరాదూ?'

"అంటే తె.... ల్లా.... టి పిల్లేనా?" — వెటకారంగా అంది అమ్మమ్మ.

ఎగిరి గంతేశాడు గోపాలం — "తెలుపంటే ఉత్తుత్తి తెలుపుకాదేవ్! అమ్మమ్మా! ఇటు చూడవే! పాలనురగలాంటి తెలుపు! పండువెన్నెల్లాంటి తెలుపు! మంచి ముత్యంలాంటి తెలుపు! మల్లెపువ్వులాంటి తెలుపు! నేను.... నేనే .... స్వయంగా చూసుకుంటానేవ్! పట్టపగలు .... పబ్లిక్‌గా .... రెండు కళ్ళతోటీ చూస్తాను. పైసా మందాన ఫేస్ పౌడర్‌కొట్టి మెర్క్యూరీ

లైట్లముందు మెరిపించి నన్ను మభ్యపెట్టెయ్యొచ్చని వాళ్లెవరో చెప్పారని నువ్వు ఒప్పేసుకోకు. తెలిసింది కదుటే?"

అమ్మమ్మకి కోపం అవధులు దాటింది - రెండుచేతులూ ఝాడించి పారేసింది - "ఆహా! నువ్వు మహాదీపంలా వె .... లి .... గి పోతున్నావని నీకు మహా .... అపరంజి బొమ్మలాంటి పెళ్ళాం వస్తుంది .... నే చూడనూ?"

"ప్చ్? నువ్వు చూడలేవేమోనే అమ్మమ్మా! పాపం దేవుడుగారు పిల్చిందే తడవుగా వెళ్ళిపోతా నంటున్నావు. ఆయన ఎప్పుడు పిల్చేస్తాడో ఏవిటో"

ఎర్రగా చూసింది అమ్మమ్మ — "మహా మురుస్తున్నావ్ గానీ నే ఛస్తే ఆ నల్లపిల్లనైనా కట్టబెట్టేదెవరో చూస్తాను."

"ఛస్తే ఎలా చూస్తావే? కొంపదీసి... దె ...దె.... దెయ్యానివై ...."

"ఛీ! నోర్ముయ్, భడవకానా! వూరుకొంటోంటే ...."

"అమ్మమ్మా? అలా తిట్టకే! నీకే పాపం! నా పేరు నీ మొగుడి పేరేకాదుటే!"

"అదేరా నా తండ్రి! వెధవపని చేశాను. నా దేవుడిపేరు తగిలించి ...."

"చచ్చాకకూడా తిట్టిపోస్తున్నావ్ నీ దే... వు... ణ్ని"

మింగేలా చూసింది అమ్మమ్మ. అంతలోనే ఏమనుకొందో ఏమో.... పోజు మార్చింది. డైలాగ్స్ మార్చింది - ఒరే గోపాలం! ఎల్లకాలం హాస్యాలేనట్రా? నీ పెళ్ళి చూడాలని .. నా ప్రాణం ఎంత వువ్విళ్లూరుతోందో నీకు మాత్రం తెలీదట్రా? నా మాటవిని ఒప్పేసుకోరా ఈ సారైనా ...."

"ఇంపాసిబుల్! ఇంపా అంటే! అసాధ్యం! జరిగేపని కాదు. అమ్మమ్మా! ఒక్కమాట. సర్వకాల సర్వావస్థలా గుర్తు పెట్టుకో. పెళ్ళికూతురు తెల్లటి తెలుపా? కాదా? ఉత్తతెలుపు కాదేవ్! నీకు తెలుసుగా? అం ఆ సంగతి ముందు తేల్చుకో. పండే అయితే సెటిల్ చేసెయ్! జోరుగా పనులన్నీ చేయించేయ్! చుట్టాలందర్నీ, బంధుమిత్ర పరివార సమేతంగా పిలిచేయ్! ఆ ముక్క కాస్త నాతో చెప్పెయ్! రైటో! కొత్తబట్టలవీ వేసేసు

కుని .... ఝామ్మంటూ తరలి వెళ్లిపోదాం. పెళ్ళాడేదాం. ఆఁ తీసుకొచ్చేద్దాం. .... ఆఁ ఏమంటావ్?"

"నీ కలలు బంగారంగాను!" బోసినోటితో నవ్వింది అమ్మమ్మ —

"నాకు తెలీకడుగుతాను, నీ కిది ధర్మంగా ఉందిట్రా? తెల్లటిపిల్ల కావాలని నీ లాంటివాడు కోరుకోవటం ఏమైనా బావుందీ? విన్నవాళ్ళు నవ్వరూ?" అంటూ నొక్కుళ్లు పడ్డ బుగ్గ నొక్కుకుంది.

"అహ్హా హ్హా .... హ్హా!" అంటూ విషాదంగా హెచ్చుస్థాయిలో నవ్వేశాడు గోపాలం. నిజంగా నాకే నవ్వొచ్చింది అమ్మమ్మా! అంత తెల్లటి పిల్ల నన్ను చేసుకుంటుందని నేను మాత్రం అన్నానా?"

గుడ్లురిమి ఆశ్చర్యంగా చూసింది- అమ్మమ్మ!- "ఇదేం చోద్యంరా నీతో! అంతా తెలిసి ఇంకా నీకెందుకాపిచ్చి?"

"చూడమ్మమ్మా? ఆ పిచ్చి నాకు కాకపోతే? ఇంకెవరి కుంటుంది? నీకు సైకాలజీ తెలుసా? తనకి లేనిదే కావాలన్న కోరిక మనిషికి ఉంటుంది! ఉండటంకాదు మహా వేధిస్తుంది. అందరాని దానిని అందుకోవాలనే తహ తహ లాడతాడు. జీవితాంతం అది అందక పోయినా ఆ నిరీక్షణనూలో .... ఆ నిరాశలోనూ ఎంతో హాయి — ఎంతో తృప్తి ...."

"గోపాలం! తర్వాత మాట్లాడుదువు. లేచి కాస్త కాళ్ళు కడు క్కోరా! రెండు బొబ్బట్లు రుచిచూదువు" - లేచిపోతూ అంది అమ్మమ్మ.

"నేనేమో నల్లటి నలుపు. వెధవ నలుపు నాకు తెల్లటి .... ఎంచక్కటి పెళ్ళాం కావాలని కోరికుంటే అదేం తప్పు? ముందు చెప్పు."

"తప్పో ఒప్పో ఆ పిల్ల ఒప్పుకోవద్దుట్రా?" విసుగ్గా అంది అమ్మమ్మ.

దిగాలు పడిపోయాడు గోపాలం - "అమ్మమ్మా? నామీద నీకు ప్రే.... మ .... లేదటే? నా పేరు నీ మొగుడి పేరే కాదటే? నా మన స్సంతా విప్పి చెప్పి ఆ పిల్లని ఒప్పించలేవటే?"

"ఏం పిల్లరా అది?" - చించుకున్నట్టే అరిచింది. అమ్మమ్మ.

బిక్కమొహంతో దిక్కులు చూశాడు గోపాలం - "ఏ పిల్ల?. ఏ పిల్ల? ఎక్కడుంది?" — చిర్రెత్తుకొచ్చింది గోపాలానికి - "నేను

బొబ్బట్లు తిననే!"

"అవేం చేశాయిరా!"

"ఉహు! నేను చస్తే తినను."

"నా తండ్రివి కదూ. అంతమాటనకు."

"లాభంలేదు. నేను తిన నన్నాగా?"

"అబ్బే! నువ్వు మాత్రం వందలూ వేలూ తింటావా? ఏవో రెండు రుచి చూడు. ఎలాగూ చేశాను. నీ కెంతో యిష్టమని."

"పోనీ అలా అన్నావ్ బావుంది. రుచి చూస్తాలే" – గోపాలం కాళ్ళు కడుక్కుందుకు దొడ్లోకి బయల్దేరాడు.

అమ్మమ్మ సణుక్కుంటోంది వెనక – "పిచ్చి సన్నాసీ.... పిచ్చి.... సన్నా....

"అమ్మమ్మా! అమ్మమ్మోవ్? వేగిరం!" – వెర్రికేక లెట్టాడు గోపాలం.

"ఏవిట్రా? ఏవైంది? ఏవైంది?" – అమ్మమ్మ కంగారు.

"అబ్బ! రావే! పరిగెత్తుకురావే! .... వచ్చావూ? అటుచూడవే.... అటు...."

"ఎటూ? ఎటూ? యేవిటుందీ?"

"అటూ! అదిగో! రాజుగారి డాబామీదికి. చూశావూ? చూశావూ? కన్పించిందీ? .... చూశావూ?"

"ఆఁ చూశా .... చూశా ...."

"కన్పించిందీ?

"ఎదురెండరా! ఆనటంలా?"

సంధించిన బాణంలా లోపలికి పరుగెత్తి.... గోడకుతగిలిన బంతిలా బయటకొచ్చిపడ్డాడు గోపాలం .... కళ్ళజోడుతో....

అమ్మమ్మ కళ్ళకి అడ్డం పెట్టుకుంటోన్న చేతిని తోసేసి అద్దాలు తగిలించాడు – "ఈసారి చూడు. సరిగ్గా చూడు. చూస్తున్నావ్ కదూ?"

"ఆఁ చూశాన్రా!"

"కన్పించింది కదూ?"

"ఆఁ కన్పిస్తుందిరా! ఎవరూ? మన రాజుగారి వరాలే కదూ

"పక్కన .... పక్కన .... ఆ పక్కన ...."

"ఎవరో ఇంకో ఆడపిల్ల .... కాస్త తెల్లగా ...."

"షటప్! అద్దాలు పీకేస్తాను. కాస్త తెలుసా? సరిగ్గా చూడు. తెల్లటి తెలుపు. మల్లెపువ్వులాంటి తెలుపు. మంచిముత్యంలాంటి తెలుపు. పాల నురగలాంటి తెలుపు. పండు వెన్నెల్లాంటి తెలుపు."

"చూస్తున్నారా! తెల్లగానే వుంది. అయితే నువ్వేవిటంటా విప్పుడూ?"

రాగాలుపోతూ అన్నాడు గోపాలం – "ఆ పిల్లెవరో అడిగి రారాదే అమ్మమ్మా!"

"బావుందిరా నీతో, తల్చుకున్నప్పుడే తాత పెళ్లా?"

"మరి ఎందుకేవిటి ఆలశ్యం? నా పెళ్లి చేసెయ్యాలని సరదా పడు తున్నా నన్నావు. ఇప్పుడేమో ...."

"నీ పిచ్చి దొంగల్దోలా! ఆ పిల్లకీ .... పెళ్ళి .... అవ్వనే అయిందో .... ఏవిటో!"

గిరుక్కున తిరిగి లోపలకుపోయి ఖద్దరు దుప్పటి ముసుగుదన్ని నిట్టూరుస్తూ పడుకున్నాడు గోపాలం.

"ఒరే గోపాలం! నెమ్మదిగా వెళ్ళి అడుగుతాలేరా" – అంటూ వచ్చింది అమ్మమ్మ." వరలక్ష్మి నడిగితే అంతా చెప్తుంది. ఆ పిల్లకి పెళ్ళి కాలేదంటే తప్పకుండా ఆ దారిన అటే వాళ్ళింటికి కూడా వెళ్ళి .... ఆ పిల్లతో మాట్లాడి" — దుప్పటి తన్నిపారేసి లేచాడు గోపాలం .... "అమ్మమ్మా బొబ్బట్లు తింటానే!"

* * *

సరిగా గోపాలం పెరట్లో తారట్లాడుతున్నప్పుడే డాబామీద వరలక్ష్మి తన నేస్తం కోమలికి గోపాలాన్ని చూపిస్తూ అంది – "అటు చూడవే కోమలీ! ఆ పెరట్లో .... అబ్బాయి .... నిన్నే కాబోలు చూస్తున్నాడు"–

అంటూ నవ్వింది.

కోమలి గోపాలాన్ని చూసింది. చూస్తూనే మొహం చిట్లిస్తూ "అబ్బ! అంత నలుపేవిటి బాబూ!" - అనేసింది.

వరలక్ష్మి విరగడి నవ్వింది— "కాకి నలుపు కదూ?"

"ఉత్త కాకికాదు. మాలకాకి నలుపు. చింతపండు నలుపు. పాలకుండ నలుపు"- ఫక్కుమంది కోమలి.

"అదిగో మళ్ళా చూడు. కళ్ళజోడు పెట్టి వాళ్ళమ్మమ్మకి కూడా చూపిస్తున్నాడు నిన్ను."

"ఎందుకూ"

"ఎందుకేమిటి? అంత దూరాన్నుంచి నీ అందాన్ని చూడలేని అమ్మమ్మకూ_డా చూపించి ఆనందింప జేస్తోంటే అతడెంత సౌందర్యోపాసకుడో నీకు అర్థంకావటంలేదూ?"

"బావుంది. నిజంగానే మామ్మగారు యిటు చూస్తోందే?" కుతూహలంగా చూసింది. కోమలి — "పాపం ఆ అబ్బాయి అంత నల్లగా వున్నందుకు నాకు నిజంగానే జాలిగావుందే వరలక్ష్మి."

"అసలు సంగతి వింటే జాలీ గీలీ పరుగుతీస్తాయ్. అతగాడికి తెల్లటి పెళ్లాం కావాలిట."

కెవ్వుమంది కోమలి — "ఆ గోపాలకృష్ణుడికా? .... తెల్లటి పెళ్ళామా?"

"పేరు కూడా అదేలే. "గోపాలం" అంటుంది వాళ్ళమ్మమ్మ. తెల్లటి పిల్లకోసం ఆవిడ కూడా వెదుకుతోంది."

"ఆ గోపాలాని కెందుకలాంటి గొంతెమ్మకోరిక పట్టుకొంది!" విస్మయంగా అడిగింది కోమలి.

"అందాన్ని అనుభవించాలనే కోరిక అతనికి ఉండనే కూడదంటావా? ఈ ముక్క అతన్నే అడిగితే ఓ లెక్చర్ దంచుతాడు సైకాలజీ మీద."

"లెక్చర్లకేంలే? అతని తాహతుకి అది చాలా అసంభవం."

"అది అతనికి అర్థం కావటంలేదుగా? - ఈ మధ్య నో గమ్మత్తు జరిగిందిలే. నీకు చెప్పనేలేదు నేను. ఆ గోపాలకృష్ణుడికి కన్యాదానం చేసి

తరించాలని మా అమ్మకీ నాన్నకీ సరదా వేసింది."

"ఏమిటీ? నిన్నా? అతనికా? ఒప్పుకున్నావూ?"

"చెప్పింది విను మరీ? నా చెవులపడేసరికి అంతా అయిపోయింది."

"అంటే ముహూర్తం పెట్టేశారా?"

"నాకు వరలక్ష్మి వద్దేవద్దు అనేశాట్ట గోపాలం" — ఫక్కుమంది వరలక్ష్మి.

విస్తుపోయింది కోమలి — "నిజంగా నిన్ను వద్దన్నాడా? నువ్వు తెలుపేగా?"

"చెప్పానుగా? అతనికి తె....ల్లా....టి పెళ్ళాం కావాలని. "థాంక్ గాడ్" అనుకుని .... నేను మరీ అంత మల్లెపువ్వులా లేనందుకు మురిసిపోయి .... హాయిగా నిశ్చింతగా .... జీవిస్తున్నాను."

చిత్రంగా చూసింది కోమలి. నీలాలవంటి కళ్ళు విప్పార్చుకొంటూ — "నువ్వు చెప్పేది హాస్యం కాదని నా కిప్పుడిప్పుడే నమ్మకం కుదురుతోంది. అబ్బాయిగారేం చదువెలగబెట్టాడేమిటీ?"

"ఎమ్మే! చాలా తెలివైనవాడు సుమీ! అందుకు సందేహంలేదు."

"అబ్బ! ఎమ్మేనా? మరి అంత ఇంగితంలేదేం?"

"బావుందే కోమలీ! పాపం అతని కోరిక అతనిది. వాళ్ళమ్మ మ్మా యింటికి వస్తూంటుందిలే. మనవడి గురించి చెప్తూ బొటబొటా ఏడ్చేస్తుంది."

"మంచి ముత్యం అంత తెలుపూ మల్లెపువ్వంత తెలుపూ ఎవరుంటారమ్మా? ఉంటే మాత్రం వీణ్ని పెళ్ళాడ్డానికి ఒప్పుకోవద్దూ? అంటుంది. నేను నవ్వాపుకోలేక ఆవిడ దగ్గిర్నించి పరిగెత్తిపోతాను."

జాలిగా చూసింది కోమలి — నిజంగా నాకు జాలేస్తోంది!"

"అయితే పెళ్ళాడరాదూ?"

"ఛీ? ఊరుకో?"

"మరి ఎందుకా జాలి?"

"పాపం అతనికి తెల్లటి పెళ్ళాం దొరికితే బావుండును."

"అమ్మో! ఇంకేమైనా వుందీ నిద్రాహారాలు విసర్జించి రాత్రింబవళ్ళు దాని ఒళ్ళంతా తడుపుతూ కూర్చుంటాడు" — ఫకాలు మంది వరాలు — జల్లుమంది కోమలి హృదయం. శరీరంలో అణువణువూ చంద్ర కిరణాలు చొచ్చుకున్నట్టు చిత్రమైన సంచలనంతో పులకరించింది.

"నిజంగా అలాంటి పెళ్ళాం దొరకాలేగాని దాన్ని జీవితాంతం పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాడు. ఇంకెంత అపురూపంగా చూసుకుంటాడో మరి" – వరలక్ష్మి మాటలు వింటూనే కోమలి చిరునవ్వుతో గోపాలంకేసి చూసింది.

"అదేవిటే అంత మందహాసం? నీ నవ్వు చూస్తే అతగాడు లేని పోని ఆశలు పెట్టుకోగలడు."

"మూర్ఛపోతా డంటావా?"

"ముందు మతి పోగొట్టుకుంటాడు. తర్వాత తన హృదయం తన కిచ్చెయ్యమని కంప్లయింట్ చేస్తూ ప్రేమలేఖ రాస్తాడు."

"ఆ తర్వాత!"

"ఎలాగూ జవాబివ్వవుగా? తిన్నగా యింటికే వస్తాడు."

"ఆహా! అంత సాహసవంతుడా?"

"అతనికి సాహసం లేదంటే మాత్రం ఒప్పుకోను. నిత్యం జోరీగలా సణిగే అమ్మమ్మనీ – వంతులవారీ హెచ్చరికలుచేసే అప్పగార్లని – చివాట్లు పెట్టి నిరాశతో పోయే బంధుబలగాన్నీ – హాస్యాలు చేసే స్నేహ బృందాన్నీ – అపహాస్యాలు పట్టించే ఆడపిల్లల్నీ ... ... అంత మందిని ఎదిరిస్తూ ... అన్ని సమస్యలకు తట్టుకొంటూ ఒక్క లక్ష్యాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని నవ్వుతూ నవ్వుతూ నిరీక్షిస్తున్నాడంటే అతడెంత సాహసవంతుడో ఆలోచించు."

"గట్టివాడే!"

కోమలి చూస్తుండగానే గోపాలం పెరట్లోంచి యింట్లోకి పరిగెత్తాడు.

* * *

పెళ్ళికొడుకు గోపాలం తెల్లటి కట్టుబట్టల్లో నల్లగా నిగనిగలాడు తున్నాడు. గోపాలం ఊహించుకొన్న దానికన్నా ఐదురెట్లు అందంగా వుంది శోభనంగది. అడుగు పెట్టీపెట్టగానే అగరొత్తులూ — సెంట్లూ — పూల రాసులూ — హారతి కర్పూరాలూ — వగైరాలన్నీ గుబాళింపులతో స్వాగతం చెప్పాయి.

నగిషీల బల్లమీద రకరకాల మిఠాయిలూ, పాల గ్లాసులూ, తమల పాకులూ - ఇంకా ఏమిటేవిటో సర్దబడి వున్నాయి.

మల్లెపూల దండలు అలంకరించిన దోమతెర పాన్పు రాజహంసలా వయ్యారాలు ఒలక బోస్తోంది.

ఆ పాన్పుకి సమీపంలో ఓ అపరంజి బొమ్మ నిలబడి వుంది. జల తారు చీర కుచ్చెళ్ళు పాదాలమీద పార్లాడుతున్నాయి. పద్మాల పైటకొంగు నేల మీద జీరాడుతోంది. మల్లెపువ్వుల వాలుజడ పిరుదుల మీద వ్రేళ్లాడు తోంది.

చీరనిండా జరీ తారలు చమక్ .... చమక్‌న .... మెరుస్తున్నాయి. ఆ సౌందర్యరాసి వదనారవిందం విరిసిన కమలం! అక్షరాల అంతే! దీక్షగా నేల చూపులు చూస్తోన్న ఆ బొమ్మ ఒక్కసారి వారగా వారవారగా క్రీగంట చూసింది.

తరించిపోయాడు గోపాలం.

చిరునవ్వుతో సమాధానం విసిరాడు.

ఆ అందగత్తె వయ్యారంగా సిగ్గుపడిది.

ధీరోదాత్తుడై దగ్గిరికి నడిచాడు గోపాలం - "కోమలీ!"

సంభ్రమంగా చూసింది కోమలి.

"నీలాగే నీ పేరుకూడా యెంతో బావుంది కోమలీ!"

గోపాలం మాటల్లోని మృదుత్వం — గోపాలం కంఠంలోని తన్మ యత్వం - కోమలిని అపారమైన సిగ్గులో ముంచివేశాయి.

గోపాలం కోమలి ఎదట .... చాలా దగ్గిరగా నిలబడి .... తదే కంగా చూడసాగాడు. ఆ మౌనవ్రతాన్నీ .... ఆ వేడి చూపుల్నీ .... తట్టు కోలేక పోయింది కోమలి. - ఒక్క అడుగు వెనక్కి వేసింది కోమలి. చటు

క్కిన చెయ్యి పట్టుకున్న గోపాలం షాక్ కొట్టినట్టు వదిలేశాడు .... "నిన్ను ముట్టుకోవటం అంటే నాకు భయం వేస్తోంది" - భయంభయంగా అన్నాడు.

"ఏం?" — విస్మయంతో కోమలి కళ్ళు తళతళ లాడాయి.

"నా నలుపు నీకు అంటుకుంటే ....? ఏమో? నువ్వుకూడా నల్లగా అయిపోతే ....?"

కళ్ళతోనే నవ్వింది కోమలి. ఆ మగవాడి అమాయకత్వం చూస్తోంటే ఆ ఆడదానికి చాలా ధైర్యం వచ్చింది. వేలిన మెరుస్తోన్న ఉంగరంకేసి చూసుకొంటూ అంది - "మీ నలుపు అంటేది కాదు. నా తెలుపు మాసేదీ కాదు. ఎందుకంత భయపడతారు?"

"ఆఁ నేనూ అలాగే అనుకున్నాను. నిజమే కదూ?" - నెమ్మదిగా తన చూపుడు వేలిని కోమలి బుగ్గమీద అంటించి చూశాడు.

కిలుక్కున నవ్వి నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొంటోన్న కోమలిని హఠాత్తుగా మీదికి లాక్కొని బలంగా కౌగిలించుకున్నాడు గోపాలం. గాఢంగా ముద్దులు పెట్టుకొంటూ ఉక్కిరి బిక్కిరి చేసేశాడు.

కోమలికి స్పృహతప్పినంతపనై గోపాలం చేతుల్లోకి వాలిపోయింది. కంగారుపడిపోయాడు గోపాలం. కోమలిని యెత్తి తీసుకువెళ్ళి మెత్తటి పరుపుమీద పడుకోబెట్టి - నుదుటిమీద జుత్తు సవరిస్తూ మృదువుగా చెక్కిళ్ళు నిమురుతూ కూర్చున్నాడు.

కొంతసేపటికి కోమలి నెమ్మదిగా లేచి దిండుకి అనుకునికూర్చుంది.

"కోమలీ! ఎందుకలా అయిపోయావు?"

హాయిగా నవ్వింది కోమలి - ఏమైపోయాను? ఏమీ కాలేదు"

"నిన్ను నువ్వే రక్షించుకొంటూ ఉండాలి కోమలీ! నేను నిన్నేం చేస్తానో కూడా తెలుసుకోలేను."

"ఫర్వాలేదు. మీరేం చేసినా నా కిష్టమే. నన్ను మీకు అర్పించు కుందామనే సిద్ధపడి వచ్చాను" - గోపాలం చేతిని తన రెండుచేతుల మధ్యకి తీసుకుంది కోమలి.

"అబ్బా! నీ చేతులు ఎంత తెలుపు కోమలీ! మల్లెపువ్వులాంటి తెలుపు .... మంచి ముత్యం లాంటి తెలుపు ...."

గోపాలం నోటికి చటుక్కున చెయ్యి అడ్డుపెడుతూ నవ్వింది కోమలి.

"చాలు చాలు! ఆ దండకం అంతా నాకు తెలుసు."

"చూడు కోమలీ! నే నెంత నలుపో! ఒక్కోసారి నా కెంత యేడుపొస్తూంటుందనుకున్నావ్? శరీరం మీద పైపొర గీకేసుకుంటే కొంచెం తెల్లగా వుంటానేమో అనుకుంటాను."

ఇంకెప్పుడూ అలా అనకండి నే వూరుకోను. సాక్షాత్తూ భగవంతుడే వచ్చి మిమ్మల్ని తెల్లగా చేస్తానన్నా నేను ఒప్పుకోను."

"అదేం? నీకు నలుపంటేనే యిష్టమా?"

"అందుకేగా మీకు తెలుపంటే యింత యిష్టం."

"కోమలీ! నిన్ను అసలు సంగతి అడగటం మర్చిపోయాను. నువ్వు మన పెళ్ళికి ఒప్పుకున్నావని విన్నప్పుడు మూర్ఛపోయాననుకో. ఎందుకు ఒప్పుకున్నావో అర్థం కాలేదు. నిన్ను మొట్టమొదట అదే అడగాలనుకున్నాను."

గోపాలం కోమలి కళ్ళలోకి దీనంగా చూశాడు —"కోమలీ! నువ్వు సౌందర్యరాశివి. నీకు నేను తగనే తగను. నన్ను నువ్వు ఎందుకు అంగీకరించావో నిజం చెప్పవూ?"

కోమలి మత్తుగా నవ్వింది- గోపాలం తలని తన వొడిలో వుంచుకుని జుత్తులోకి వేళ్ళు దూర్చి అతని మొహంలోకి అరమోడ్పు కన్నులతో చూస్తూ అంది- "అది మీరు తెలుసుకోలేని రహస్యమే అయితే తప్పకుండా చెప్తాను. అందమైన స్త్రీ జీవితాంతమూ తనను ఆరాధించే పురుషుణ్ణే కోరుకొంటుంది. దాంపత్య జీవితంలో తన అందానికో ప్రత్యేకత నిలుపుకొంటుంది. ఇలా బ్రతుకంతా మీ పొగడ్తలు వింటూ నా అందాన్ని అర్పించుకుంటూ మీచేత ఆరాధింపబడుతూ గడపటంకన్నా మహాభాగ్యం నా కింకేముంటుంది? ఆవేశపూరితమైన మీ కౌగిట్లో నలిగి శాశ్వతంగా కన్ను మూసినా నాకు సంతోషమే."

"కోమలీ!" అంటూ కోపంగా చూశాడు గోపాలం.

అందంగా నవ్వేసింది కోమలి.

(నెలవంక నుంచి)